

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.34

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,300 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
31.7°/21.4°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 15 కి.మీ వేగంతో గాలి వీచింది.

ఆదివారం । 27 । జూలై । 2025

న్యూస్‌రీల్

శ్రావణం.. భక్త పారవశ్యం

- భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుని ఆలయం



సైదాపురం ఆంజనేయస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

కదిరి టౌన్: శ్రావణం రాకతో ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తుతున్నాయి. తొలి శనివారం కావడంతో జిల్లాలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తెల్లవారు జామునే ఆలయాల ఎదుట బారులు తీరి స్వామి వారిని దర్శించుకుని తరించారు. ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆకుపూజలు చేశారు. ఇక ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అర్చకులు చేశారు. ఇక కదిరిలోని సైదాపురం అంజనేయస్వామి, ద్వారకా ఆంజనేయ స్వామి, పంచముఖ అంజనేయ స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

అఫ్జల్ మెహరాజ్‌కు అరుదైన అవకాశం

- జూడో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపిక



అఫ్జల్ మెహరాజ్

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అఫ్జల్ మెహరాజ్‌కు అరుదైన అవకాశం దక్కింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భోపాల్‌లో నడిచే జూడో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు అధికారులు అఫ్జల్ మెహరాజ్‌ను ఎంపిక చేశారు. భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో దేశ వ్యాప్తంగా 45 మంది క్రీడాకారులు పోటీపడగా...ఆంధ్రప్రదేశ్ నుంచి అఫ్జల్ మెహరాజ్ ఒక్కడే ఎంపికైనట్లు పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ కేంద్రంలో ఒలింపిక్స్, ఇతర అంతర్జాతీయ ఈవెంట్‌లలో పాల్గొనే క్రీడాకారులకు అత్యున్నత శిక్షణ ఇస్తారన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: అప్పులబాధతో ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ధర్మవరం పట్టణంలో చోటుచేసుకుంది. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన యర్రజోడు శ్రీరాములు(56) చేనేత కార్మికుడు. ఆయన భార్య అమరావతి కూడా కరెంటు మగ్గాలకు బోట్‌లు చుట్టే పనికి వెళ్తోంది. వీరికి ఐదుగురు కూతుళ్లు సంతానం కాగా, నలుగురికి వివాహాలు చేశారు. ఈ క్రమంలో ఆడపిల్లల వివాహాలు కుటుంబ పోషణ కోసం శ్రీరాములు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఇటీవల రుణదాతల ఒత్తిళ్లు అధికం కాగా, అప్పులు తీర్చే మార్గం కనిపించక శ్రీరాములు తీవ్రంగా మదనపడేవాడు. ఈ క్రమంలోనే శనివారం భార్య అమరావతి పనికి వెళ్లగా...శ్రీరాములు ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. భార్య అమరావతి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

లేపాక్షి: అట్టడుగున ఉన్న వారి సాధికారత కోసం చేపట్టిన పీ–4 కార్యక్రమం ద్వారా పేదల జీవితాల్లో తప్పక మార్పు తీసుకువస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శనివారం ఆయన లేపాక్షి మండలం కంచిసముద్రంలో పీ–4 కార్యక్రమంపై జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'జీరో పావర్టీ పీ–4 పాలసీ' అమలుకు కృతనిశ్చయంతో ముందడుగు వేస్తోందన్నారు. నిరుపేదల జీవితాలను మార్చే పీ–4 కార్యక్రమంలో విద్యావంతులు, ఎన్ఆర్ఐలు, ఉపాధ్యాయులు, సంపన్నులు భాగస్వాములై పేదరిక నిర్మూలనకు తోడ్పాటు అందించాలన్నారు. విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారికి చేయూతనిస్తే.. వారంతా తప్పకుండా ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు, దాతలు కలిసి పనిచేస్తే సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాల్లో వెలుగులు నిండుతాయన్నారు. అధికారులు కూడా బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను గుర్తించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగలక్ష్మమ్మ, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వసతి.. అధోగతి



బత్తలపల్లి ఎంజేపీ బాలుర వసతి గృహంలో నేలపైనే ఇరుక్కుని పడుకున్న విద్యార్థులు



ఇవి తాడిమర్రి బీసీ బాలుర వసతి గృహంలోని మరుగుదొడ్లు. ఇక్కడ 20 దాకా టాయిలెట్లు ఉన్నా.. మూడు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. వాటికి కూడా నీటి సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది వసతి గృహంలో 150 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఈ ఏడాది 30 మంది కూడా లేరు. ఇక్కడ కనీసం పడుకునేందుకు సరైన సౌకర్యం లేక విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు.



ఇది హిందూపురంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహం. గదులు శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులు రాలి పడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. కిటికీలకు మెష్, తలుపులు సరిగా లేకపోవడంతో విద్యార్థులు చలికి వణుకుతూ, దోమకాట్లకు గురవుతూ రోగాల బారిన పడుతున్నారు.



గాండ్లపెంట బీసీ బాలుర వసతి గృహంలో బిందెతో తెచ్చిన నీటిని తాగుతున్న విద్యార్థులు

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల వివరాలు ఇలా..

60	బీసీ వసతి గృహాలు
14	ఎస్సీ వసతి గృహాలు
05	ఎస్టీ వసతి గృహాలు

సన్నబియ్యం.. అన్నం తినలేం
నీళ్లచారు.. కూరగాయలే లేని సాంబార్
– సంక్షేమ హాస్టళ్లలో మెనూ తీరిది

మరుగుదొడ్లు..ఉపయోగించలేం
పరిసరాల రోత.. దోమల మోత
– వసతి గృహాల్లో పారిశుధ్య చర్యలివీ

తాగునీరు కరువు.. సమస్యల దరువు
గదుల కొరత.. పాలకుల నిర్లిప్తత
– సౌకర్యాల కల్పన ఇదీ..



కదిరి బీసీ బాలుర వసతి గృహంలో ప్లేట్లు కడిగేందుకు ఉపయోగించే నీటినే తాగుతున్న విద్యార్థులు



కదిరి బీసీ సంక్షేమ హాస్టల్‌లో తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు

సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కరువు

- వేధిస్తోన్న మరుగుదొడ్లు, తాగునీటి సమస్య
- మెనూకు మంగళం
- దోమ తెరలు రావు.. కిటికీలకు మెష్ లేదు
- ఏ హాస్టల్ పరిశీలించినా స్పష్టంగా కనిపిస్తోన్న సమస్యలు
- జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ తప్పని తిప్పలు
- నరకం చూస్తున్న వసతి గృహాల్లోని చిన్నారులు

సాక్షి, పుట్టపర్తి/సాక్షి నెట్‌వర్క్: సంక్షేమ హాస్టళ్లు నరకానికి నకళ్లుగా మారాయి. కనీస సౌకర్యాలు లేక అధ్వానంగా మారాయి. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకాలోని హాస్టళ్లలో చిన్నారుల ఆరోగ్యం గురించి పట్టించుకునే వారే లేరు. ఇక బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఇలాకాలో సంక్షేమమే లేదు. జిల్లాలోని ఏ ప్రభుత్వ హాస్టల్‌లో చూసినా.. విద్యార్థుల అవస్థలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేవు. మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదు. వసతి గృహాల పక్కనే మురికి కాలువలు దర్శనమిస్తున్నాయి. నిద్రపోయేందుకు మంచాలు లేక నేల మీద నిద్రించాల్సిన దుస్థితి. కిటికీలకు తలుపులు సరిగా లేవు. దోమతెరలు కనిపించవు. ఇలా..పలు అవస్థల మధ్య వసతి గృహాల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.

79 హాస్టళ్లు.. 6 వేల మంది విద్యార్థులు

జిల్లాలో 60 బీసీ, 14 ఎస్సీ, 5 ఎస్టీ సంక్షేమ హాస్టళ్లున్నాయి. ఆయా హాస్టళ్లలో సుమారు 6 వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఏ ఒక్క హాస్టల్‌లో కూడా వసతులు సరిగా లేవు. మరుగుదొడ్లు ఉన్నా.. తలుపులు ఉండటం లేదు. ఆరు బయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి. హాస్టల్‌లో తిండి నాణ్యత లేకపోవడంతో.. చాలామంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. అంతేకాకుండా నిత్యం దోమలు స్వైర విహారం చేస్తుండటంతో జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

సాక్షి విజిట్

పర్యవేక్షించాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

హాస్టల్‌లో నీటి సరఫరా సరిగా లేదని ఎన్నిసార్లు చెప్పినా తీరు మారలేదని విద్యార్థులు వాపోతున్నారు. పదే పదే చెప్పితే ఇబ్బందులు పెడతారేమోననే భయంతో ఇంకొందరు మౌనంగా ఉంటున్నారు. వర్షాకాలం కలుషిత నీరు సరఫరా కావడంతో పాటు హాస్టల్ చుట్టుపక్కల మురుగునీరు ప్రవహిస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేరని విద్యార్థులు వాపోతున్నారు.

నీళ్ల చారు.. ముద్దన్నం

వసతి గృహాల్లోని విద్యార్థులకు సరిపడా సరుకులు అందజేయడంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఉన్న వాటితోనే అందరికీ పంచి పెట్టాలనే ఉద్దేశంతో నీళ్ల చారు.. ముద్దన్నం వడ్డిస్తున్నారు. గత్యంతరం లేక.. ఎవరినీ ప్రశ్నించలేక.. విద్యార్థులు ఎంతోకొంత తిని కాలం గడిపేస్తున్నారు. సరిగా సరుకులు పంపిణీ చేయకుండా టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కనీస సౌకర్యాలు కరువు

తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. స్నానపు గదులు ఉండటం లేదు. నీటితొట్టె ఏర్పాటు చేయడంతో అందరూ ఒకేసారి గుంపుగా వెళ్లి స్నానం చేయాల్సిన పరిస్థితి. మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు తలుపులు లేని గదులు హాస్టళ్లలో దర్శనమిస్తున్నాయి.



ధర్మవరంలోని బీసీ హాస్టల్‌లో నేలపైనే నిద్ర

జ్వరం వస్తోంది



మా హాస్టల్‌లో దోమలు చాలా ఎక్కువగా ఉన్నాయి. విపరీతంగా కుడుతున్నాయి. రాత్రి వేళ నిద్రకూడా ఉండటం లేదు. దోమలు కుట్టడంతో నాకు మూడు రోజులుగా జ్వరం వస్తోంది. హాస్టల్ సిబ్బంది మాత్ర మాత్రమే ఇచ్చారు. అయినా జ్వరం తగ్గలేదు. అందుకే మా అమ్మానాన్నకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాను. వారు వచ్చాక డాక్టర్ వద్దకు తీసుకెళ్తారని చెబుతున్నాడు. వార్డెన్ సారు కూడా ఇక్కడికి సరిగా రారు.

– వెంకీ 6వ తరగతి విద్యార్థి, కదిరి బీసీ బాలుర వసతి గృహం

సౌకర్యాలు కరువు సమస్యల దరువు

- కనగానపల్లి బీసీ బాలుర వసతి గృహంలో 200 మందిపైగా విద్యార్థులున్నారు. ఇక్కడ కేవలం ఆరు బాతురూంలు, రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది.
- చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర వసతి గృహంలో 100 మంది విద్యార్థులుండగా.. సరిపడా మరుగు దొడ్లు, బాతురూంలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికి వణుకుతూ ఆరుబయటే స్నానం చేయాల్సి వస్తోంది.
- లేపాక్షి బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. వసతి గృహం ఊరికి దూరంగా ఉండటంతో రాత్రి వేళ విద్యార్థులు బహిర్భూమికి వెళ్లేందుకు భయపడుతున్నారు.
- పెనుకొండలోని ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 250 మంది విద్యార్థులుండగా...25 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అందులో పది నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక మరుగుదొడ్లకు తలుపులు సైతం లేవు.
- మడకశిర మండలం నీలకంఠాపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో 206 మంది విద్యార్థులుండగా.. ఇప్పటి వరకూ ఒక్కరికీ బెడ్‌షీట్లు ఇవ్వలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు పెరిగి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచాలు లేకపోవడంతో కటిక నేలపై నిద్రిస్తున్నారు. గుండుమల బీసీ గురుకుల బాలుర వసతి గృహంలో 520 మంది విద్యార్థులు చదువుకుంటుండగా..గదుల సమస్య తీవ్రంగా ఉంది.
- బత్తలపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 370 మంది విద్యార్థులు ఉన్నారు. పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో మరుగుదొడ్లు, బాతురూంలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. కిటికీలకు మెష్ లేకపోవడంతో దోమకాట్లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోయాయి. మూత్రశాల బ్లాక్ అయ్యింది. అయినా తప్పని సరి పరిస్థితుల్లో విద్యార్థులు దాన్నే వాడుతున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది.
- ధర్మవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 37 మంది విద్యార్థులు ఉంటున్నారు. అందరికీ దుప్పట్లు ఇవ్వకపోవడంతో రాత్రి వేళ చలికి తట్టుకోలేక ఒకే దుప్పటిని ఇద్దరు, ముగ్గురు కప్పుకుంటున్నారు. ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో మున్సిపల్ కొళాయి నీరే తాగాల్సిన పరిస్థితి నెలకొంది.
- కదిరి బీసీ బాలుర వసతి గృహంలో 140 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ కనీస వసతులు లేవు. చివరకు ఆర్‌ఓ ప్లాంట్ కూడా లేకపోవడంతో బోరునుంచి వచ్చే ఉప్పునీటినే విద్యార్థులు తాగుతున్నారు. మెనూ కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో రుచిపచీ లేని సాంబారు, నీళ్ల రసం ఇస్తున్నారు. వార్డెన్ జయరామిరెడ్డికి గాండ్లపెంట, నల్లచెరువు వసతి గృహాల బాధ్యతలు కూడా ఇవ్వడంతో ఆయన ఎప్పుడు..ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియడం లేదు.



గుడిబండ మండలం మందలపల్లి వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

టేకులోడు రైతు నోట్లో మట్టి



టేకులోడులో నిర్వహించిన గ్రామసభలో ఆర్డీఓ, ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు

- సెజ్ పేరుతో బలవంతపు భూసేకరణ
- ఎకరా రూ.12.66 లక్షలకే సంతకాల సేకరణ
- ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల కనుసన్నల్లో వ్యవహారం

చిలమత్తూరు: రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం 'సెజ్' పేరుతో వారి నోట్లో మట్టికొడుతోంది. పంటలు పండే భూములకు నామమాత్రపు పరిహారం ఇచ్చి బలవంతంగా సేకరిస్తోంది. మండల పరిధిలోని టేకులోడు గ్రామ పంచాయతీ పరిధిలోని అసైన్డ్ భూముల సేకరణను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే శనివారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అధ్యక్షతన టేకులోడులో గ్రామసభ ఏర్పాటు చేసి రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. భూసేకరణ అంశం గురించి బహిరంగ ప్రకటన చేయకుండా... కేవలం రైతులకు మాత్రం సమాచారం ఇచ్చి ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల కనుసన్నల్లో నాలుగు గోడల మధ్య రైతులతో రహస్యంగా సంతకాల సేకరణ చేయడం అనుమానాలకు తావిస్తోంది.


ఎకరం రూ.12.66 లక్షలే...

టేకులోడు రెవెన్యూ గ్రామ పరిధిలో ప్రభుత్వం సెజ్ ఏర్పాటు కోసం భూసేకరణ చేపట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్డీఓగా పనిచేసిన మధుసూదన్ ఎకరం ధర రూ. 25 లక్షలు ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించి ప్రభుత్వంతో కూడా మాట్లాడినట్లు అప్పట్లో రైతులతోనే చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎకరాకు రూ.12.66 లక్షలకే ధర నిర్ణయించడం, రైతులను బలవంతంగా ఒప్పించడం చకచకా జరిగిపోయాయి. అసైన్డ్ పట్టాలు పొందిన రైతులు వివాదాలు ఎందుకులే అన్నట్టు భూములు ఇచ్చేందుకు మొగ్గు చూపగా, మరికొందరు మాత్రం విముఖత చూపారు. దీంతో కొందరు నేతలు వారితో బలవంతంగానే సంతకాలు చేయించినట్లు తెలుస్తోంది.

రాత్రికి రాత్రే నిర్ణయం మార్చుకుని

భూములు తక్కువ ధరలకు ఇవ్వకూడదని శుక్రవారం రాత్రి రైతులు తీర్మానించుకున్నారు. అయితే శనివారం భూములిచ్చేందుకు ముందుకు రావడం చర్చనీయాంశంగా మారింది. భూములు ఇవ్వకపోతే అసైన్డ్ భూములు బలవంతంగా అయినా లాక్కొంటామని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు కొందరి నేతల ద్వారా రైతులకు చేరవేసినట్టుగా తెలుస్తోంది. అందువల్లే అసైన్డ్ భూములున్న రైతులంతా చకచకా సంతకాలు చేశారు.

తుంగభద్రమ్మ ఉగ్రరూపం



తుంగభద్ర జలాశయం నుంచి నదికి పోతున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్రమ్మ ఉగ్రరూపం దాల్చింది. టీబీ డ్యాంకు వరద పోటెత్తింది. జలాశయానికి ఎగువన ఉన్న తుంగ డ్యాం నుంచి 70 వేల క్యూసెక్కులు, భద్ర డ్యాం నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా.. ఇదే క్రమంలో నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షం భారీగా కురవడంతో వరద ఉరకలెత్తుతూ డ్యాంకు చేరుతోంది. ఈ క్రమంలో టీబీ బోర్డు అధికారులు డ్యాం గేట్లన్నీ తెరిచి లక్ష క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. పరివాహక ప్రాంతాల గ్రామాలకు హెచ్చరికలు జారీ చేశారు. నది వైపు రైతులు, మత్స్యకారులు, జాలర్లు వెళ్లరాదని సూచించారు. తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగులకు గాను ప్రస్తుతం నీటి నిల్వ 1,625.43 అడుగులకు చేరింది. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, డ్యాం 19వ గేటు సరిగా లేని కారణంగా నీటి నిల్వ సామర్థ్యం కుదించారు. 80 టీఎంసీలు నిల్వ చేసి మిగిలిన నీటికి నదికి విడుదల చేస్తున్నారు. 19వ గేటు మినహా మిగతా గేట్లన్నీ ఎత్తి వరదను నదికి మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఒక్కరోజే లక్ష క్యూసెక్కుల నీరు నదిలి వదిలినట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

బోధనేతర పనులు తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి అర్బన్: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని, క్యాడర్ స్ట్రెంత్‌తో జీతాలు రాని ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన కంటే బోధనేతర పనులకు ఎక్కువ సమయం పడుతోందని, యోగాంధ్రా, మెగా పేరెంట్స్ మీటింగ్, శిక్షణ తరగతుల పేరుతో బోధనకు దూరం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులకు ఏ మాత్రం సంబంధం లేని పీ4 సర్వేలను ఉపాధ్యాయులపై మోపుతున్నారన్నారు. యాప్‌ల భారం తగ్గించడం లేదన్నారు. బదిలీలు జరిగి రెండు నెలలు గడుస్తున్నా సుమారు 25 వేల మంది ఉపాధ్యాయులకు రెండు నెలల జీతం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించక పోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఏడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహీర్ వలి, లక్ష్మీనారాయణ, శివశంకర్, కిష్టప్ప, రామాంజనేయులు, మాలింగప్ప, రామాంజనేయులు, నబీ, రాజగోపాల్, గోవిందప్ప, రవీంద్రరెడ్డి, బాబు, మధుసూదన్ రెడ్డి, రాజేష్‌బాబు, సాలప్ప పాల్గొన్నారు.

పాలించే అర్హత రాహుల్‌కు ఉంది



మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర: దేశాన్ని పాలించే అర్హత రాహుల్‌గాంధీకి పూర్తి స్థాయిలో ఉందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డి తెలిపారు. ఆయన శనివారం మడకశిర మండలం నీలకంఠాపురంలో మీడియాతో మాట్లాడారు. ఓబీసీ సదస్సులో రాహుల్ మాట్లాడిన మాటలు చాలా అద్భుతమని ప్రశంసించారు. దేశంలో 70 సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో రిజర్వేషన్లతో పాటు అన్ని హక్కులు పేదవారికి ఇచ్చే టటువంటి చట్టాలు వచ్చాయని పేర్కొన్నారు. అగ్రవర్ణాల్లో ఉన్న పేదలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా ఏ విధంగా ఆదుకోవాలనే తపన రాహుల్‌కు ఉందని తెలిపారు. పట్టువదలని విక్రమార్కుడిలా జన, కులగణన చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విజయం సాధించారన్నారు. రాహుల్‌కు అన్ని అంశాలపై కూడా పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు.

ఆదాయం కోసం అడ్డదారులు

☛ శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఎస్ఆర్‌ఓకు అవినీతి అధికారిగా పేరుంది. గతంలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న సమయంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్రయ, విక్రయదారులు లేకుండానే థర్డ్ పార్టీ వ్యక్తులతో కుమ్మక్కై భారీస్థాయిలో డబ్బులు దండుకొని గతంలో రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌ను రద్దు చేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో.. కిందిస్థాయి ఉద్యోగులపై తప్పును నెట్టారు. ఉన్నతాధికారులు మరోమారు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సబ్ రిజిస్ట్రార్ పాత్ర ఉందంటూ నివేదిక ఇవ్వడంతో సస్పెండయ్యారు. ప్రస్తుతం బుక్కపట్నంలో సైతం అదే పంథాలో విధులు నిర్వర్తిస్తున్నారు. టీడీపీ నేతల అండతో పెద్ద ఎత్తున అసైన్డ్, ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది.



- అక్రమాలకు నిలయంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా కానుకలు ఇవ్వాల్సిందే
- టీడీపీ నేతల కనుసన్నల్లో పని చేస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో భారీగా అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు
- రూ.లక్షల్లో దండుకుంటున్న సబ్ రిజిస్ట్రార్లు

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. క్రయవిక్రయాలకు సంబంధించి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయాలంటే అధికారులకు చేయి తడపాల్సిందే. లేదంటే కొర్రీలు వేసి రిజిస్ట్రేషన్లు కాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలు ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారు చెబితే ఎలాంటి భూములకైనా రిజిస్ట్రేషన్లు చేస్తారు. వారి ఆజ్ఞ లేకుంటే పట్టా భూములను సైతం రిజిస్ట్రేషన్ చేయకుండా కొర్రీలు చూపుతారు. ఇటీవల చిలమత్తూరులో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ ఇటీవలే కదిరికి బదిలీపై వెళ్లిన ఓ సబ్ రిజిస్ట్రార్ పెద్ద మొత్తంలో డబ్బు దండుకుని చిలమత్తూరు పరిధిలో ఓ ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం కాస్తా పార్లమెంట్ స్థాయి ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లడంతో ఆయన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగమేఘాలపై ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఫ్రీ హోల్డ్ భూములను అక్కడి సబ్ రిజిస్ట్రార్ పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేశారు. కూడేరు మండలం కమ్మూరులో డైక్లాట్‌లో రోడ్డుగా ఉన్న 5 ఎకరాల స్థలాన్ని ఏడాది క్రితం ఓ సబ్ రిజిస్ట్రార్ భారీగా ముడుపులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు స్థలంలో ఓ వెంచర్ వెలిసిందంటే ఏ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయో స్పష్టంగా అర్థం అవుతోంది.

భూ యజమానులపైనే కేసులు..

అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి పాలం రుద్రంపేట పరిధిలో అత్యంత విలువైన 5 ఎకరాల పొలం లావాదేవీలపై భూ యజమానులు కోర్టులో దావా వేశారు. కోర్టులో దావా నడుస్తున్న ఆ భూమిని ఓ మిల్క్ డెయిరీ నిర్వాహకుడు కొనుగోలు చేశాడు. డెయిరీ నిర్వాహకునితో రూరల్, అనంతపురం రామ్‌నగర్ కార్యాలయాల్లో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు కుమ్మక్కై రూ.లక్షల్లో డబ్బులు తీసుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. బాధిత భూయజమానులు రామ్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తే.. విధులకు ఆటంకం కలిగించారని వారిపైనే పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేయడం గమనార్హం.

నామమాత్రంగా ఏసీబీ దాడులు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు ఏడాదికి, రెండేళ్లకోసారి నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆరేళ్లలో కేవలం మూడు సార్లు మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. అనంతపురం రామ్‌నగర్ కార్యాలయంలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రారు సత్యనారాయణపై ఏసీబీ దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. బుక్కపట్నంలో ఎస్ఆర్‌ఓ శ్రీనివాసులు ఏడాది క్రితం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే ఆయన ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకొని చెన్నై వెళ్లి అక్కడ ఓ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తాజాగా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



సబ్ రిజిస్ట్రార్లు అక్రమాలకు పాల్పడితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. సబ్ రిజిస్ట్రార్లు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవహరించాలి. ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడిస్తే సహించేది లేదు. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌పై ఏసీబీ దాడుల నివేదిక ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, అనంతపురం

ఒక్క గృహమూ నిర్మించలేదు

అమరాపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును పరిశీలించేందుకు నేషనల్ మానిటరింగ్ కమిటీ లీడర్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హాలుకూరు పంచాయతీలో పర్యటించారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పింఛన్లు, ఉపాధి హామీ పనులు, మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలు, హౌసింగ్ పథకం గురించి గ్రామస్తులను ఆరా తీశారు. ఇంతవరకు ఒక్క గృహం కూడా నిర్మించలేదని గ్రామస్తులు తెలిపారు. అర్హత ఉన్నా చాలామందికి పింఛన్లు ఇవ్వలేదని చెప్పారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు రూ.30 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని విన్నవించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు దయాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్, ఎంపీడీఓ రామారావు, ఏపీడీ శివానందనాయక్, ఏపీఓ శివన్న, సర్పంచ్ హనుమక్క ప్రజలు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఉమ్మడి ప్రయోజనాలే ముఖ్యం

- జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి
- రంగనాయకుని చెరువు వివాదంపై చర్చ



మాట్లాడుతున్న జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

కదిరి అర్బన్: గ్రామంలో ఉమ్మడి ప్రయోజనాలే ముఖ్యమనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలని జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి పేర్కొన్నారు. శనివారం పట్నం గ్రామంలో రంగనాయకుని చెరువును ఆమె సందర్శించారు. కొంత కాలంగా రంగనాయకుని చెరువుపై తమకే హక్కు ఉందని మత్స్యకార సొసైటీ, లేదు చెరువు ఉమ్మడి ఆస్తి అని పంచాయితీకి అప్పగించి చెరువుకింద ఆయకట్టు సాగు జరిగేలా చూడాలని గ్రామ రైతుల మధ్య వివాదం నడుస్తున్న విషయం విదితమే. జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి మాట్లాడుతూ రంగనాయకుని చెరువు సమస్యపై తనకు ఫిర్యాదు అందిందని, అందుకే క్షేత్రస్థాయిలో సమస్య తెలుసుకునేందుకు వచ్చానని చెప్పారు. 2008లో చెరువును ఏకపక్షంగా ఊరందరి అభిప్రాయాలు తీసుకోకుండా మత్సకార సొసైటీకి అప్పగించారని రైతులు తెలిపారు. అందుకు ఆమె స్పందిస్తూ కొంతమంది ప్రయోజనాల కోసం చెరువుకింద ఉన్న 400 ఎకరాల భూమిని సాగు లేకుండా చేయడం మానవహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఇప్పటికే ఆయకట్టు రైతులు రూ.కోట్లల్లో నష్టపోయినట్లు అర్థమౌతోందన్నారు. తన విచారణలో సొసైటీ నిర్వహణ కూడా నిబంధనల మేరకు జరగలేదని తెలుస్తోందన్నారు. చెరువును పంచాయతీకి అప్పగించాలన్న వారు చేతులెత్తాలని చెప్పగా 90 శాతం మంది చేతులు పైకెత్తారు. ఇరువర్గాలకు నష్టపోకుండా ఆమోద యోగ్యమైన నిర్ణయాన్ని అధికారులు తీసుకుంటారని ఆమె పేర్కొన్నారు. ఆర్డీఓ శర్మ మాట్లాడుతూ చెరువు కింద పంటలు సాగు చేసేవారు, చెరువులో చేపలు పట్టేవారు ఇద్దరూ రైతులేనని ఎవరూ నష్టపోకుండా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మత్స్య శాఖ ఏడీ రామచంద్రా రెడ్డి, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్, తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెలు

తనకల్లు: కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి చెందిన ఘటన కొక్కంటిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కా పెద్ద వెంకటరమణ, రామలక్ష్మమ్మ దంపతులు గొర్రెలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోని పాకలో గొర్రెలను కట్టేశారు. శనివారం తెల్లవారుజామున కుక్కలు మందలోకి దూరి దాడి చేయడంతో 20 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

పటిష్ట నిఘాతో నేరాలు తగ్గుముఖం

- నేర సమీక్షలో ఎస్పీ రత్న



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా ఉంచడంతో నేరాలు 27 శాతం తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. శనివారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలల్లో జరిగిన క్రైమ్ పురోగతి, నేర నియంత్రణకు పోలీస్ యంత్రాంగం చేపట్టిన చర్యలు, పెండింగ్ కేసులు, హత్య, పోక్సో, ప్రాపర్టీ, దొంగతనాలు, చీటింగ్, మిస్సింగ్ కేసుల గురించి చర్చించారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతో పాటు పీడీ చట్ట ప్రయోగం, పల్లె నిద్ర వంటి చర్యలలు చేపట్టడంతో జిల్లాలో నేరాలు తగ్గినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై పెరిగిన నేరాలను తగ్గించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నేర నియంత్రణకు జిల్లాలో రెండు చోట్ల కంట్రోల్ రూమ్‌లు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఏడు శాతం తగ్గినట్లు చెప్పారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ప్రజలకు బెస్ట్ పోలీసింగ్ సేవలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో గణేష్ ఉత్సవాలు, సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల బందోబస్తు కోసం ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం పబ్లిక్ ప్రాసెక్యూటర్ సృజన మాట్లాడుతూ పోక్సో కేసులు, బాలికలు మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కీలక కేసును త్వరగా ఛేదించడం, నిందితులను అరెస్ట్ చేయడం, దర్యాప్తు సకాలంలో పూర్తి చేయడం, పెండింగ్ కేసులు తగ్గించడంలో పురోగతి చూపిన 57 మంది పోలీస్ అధికారులను సన్మానించి, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రామ్‌నాయక్, ఫైర్ అధికారి మాధవనాయుడు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, పీపీలు లక్ష్మీనారాయణ, పద్మజ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, డీఎస్పీలు విజయకుమార్, ఆదినారాయణ, నరసింగప్ప, శివనారాయణస్వామి, మహేష్, శ్రీనివాసులతో పాటు సీఐలు, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం సబ్ డివిజన్‌కు బెస్ట్ అవార్డు

బత్తలపల్లి: జిల్లాలోని ఐదు పోలీస్ సబ్ డివిజన్‌లో అన్నింటా మంచి ప్రతిభ కనబర్చిన ధర్మవరం పోలీస్ సబ్ డివిజన్‌కు బెస్ట్ అవార్డును ఎస్పీ రత్న అందజేశారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తరఫున తాను బెస్ట్ అవార్డు అందుకున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

శ్రావణ శనివారం... భక్త జన సందోహం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వర స్వామి



అలంకరణలో శీతలాంబదేవి



శనీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పావగడ: శ్రావణ మాస తొలి శనివారాన్ని పురస్కరించుకుని స్థానిక శనీశ్వరస్వామి స్వర్ణ దేవాలయానికి భక్త జనసందోహం పోటెత్తింది. శనీశ్వరస్వామి, జ్యేష్ఠాదేవి, శీతలాంబదేవి మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల ప్రాంతంలో శనీశ్వరస్వామికి పంచామృతాభిషేకం, తైలాభిషేకం, నవగ్రహ పూజలను ఆలయ ప్రధాన అర్చకులు అనంత రాం భట్, కృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ లోపలి భాగంలో ఇటీవల నూతనంగా నిర్మించిన స్వర్ణ దేవాలయం మిరుమిట్లు గొల్పింది.ఆలయ సమితి నూతన అధ్యక్షుడు అనిల్ కుమార్ నేతృత్వంలో పదాధికారులు, వలంటీర్లు ఉత్సాహంగా భక్తులకు సేవలందించారు. కర్ణాటకలోని దావణగెరె, శివమొగ్గ, చిత్రదుర్గం, చెళ్లికెర, ఆంధ్రలోని అనంతపురం, ధర్మవరం, కళ్యాణదుర్గం, మడకశిర తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కారు మబ్బులు కమ్ముకుని వర్షం కురుస్తున్నా భక్తులు లెక్క చేయక క్యూలో నిల్చుని శనీశ్వరుడిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ సురేశ్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెన్నై భక్తుల సాంస్కృతిక వైభవం



నవవిధ భక్తి భావన నృత్యరూపకంలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో చైన్నై సత్యసాయి భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక వైభవం చాటారు. 1500 మంది భక్తులు ఉత్తర చెన్నై నుంచి పాదయాత్రగా పుట్టపర్తికి చేరుకున్నారు. శనివారం ఉదయం ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభామందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'సర్వదేవతా స్వరూప సాయి' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ సాగిన సంగీత కచేరీ భక్తులను మైమరపింపజేసింది. సాయంత్రం 'నవవిధ భక్తి భావన' పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

యువతి ఆత్మహత్య

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. దుర్గానగర్‌కు చెందిన ముస్తఫా కుమార్తె రేష్మా (2) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రేష్మా శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో పైకప్పునకు ఉరివేసుకుని ప్రాణం తీసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసు, రైల్వే జట్ల విజయం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ ప్రీ-క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఆర్డీటీ స్టేడియంలో జరిగింది. అనంతపురం ఆర్టీసీ జట్టుతో జరిగిన పోటీలో అనంతపురం పోలీస్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం పోలీస్ జట్టు 20 ఓవర్లలో 237 పరుగుల భారీ స్కోరు సాధించింది. పోలీస్ జట్టులో రాఘవేంద్ర 52 పరుగులతో ఆకట్టుకున్నాడు. అనంతరం ఆర్టీసీ జట్టు 20 ఓవర్లలో 125 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

☛ ఆర్డీటీ బీ గ్రౌండ్‌లో ధర్మవరం మునిసిపాలిటీ, రైల్వే యూఎఫ్ఎస్‌డీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ధర్మవరం మున్సిపాలిటీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 136 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లోకేశ్ 44 బంతుల్లో 9 ఫోర్లతో అర్ధసెంచరీ సాధించాడు. రైల్వే జట్టు 11 ఓవర్లలోనే 137 పరుగుల లక్ష్యాన్ని సాధించింది. గణేష్ 37 బంతుల్లో 71 పరుగులు (5 సిక్సర్లు, 7 ఫోర్లు) చేసి జట్టుకు సునాయసంగా విజయాన్ని అందించాడు.

ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏకు సెగ



ఎమ్మెల్యే పీఏను ఖాళీ బిందెలతో అడ్డుకున్న మహిళలు

చిలమత్తూరు: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏకు చిలమత్తూరు మండలం టేకులోడులో నిరసన సెగ తగిలింది. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. ఈ క్రమంలో శనివారం గ్రామసభలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే పీఏకు మహిళలు ఖాళీ బిందెలను రోడ్డుపై ఉంచి నిరసన తెలియజేశారు. సర్పంచ్ మొదలు అధికారుల వరకు సమస్యను వివరించినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య తీర్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. నీటి సమస్య తీరుస్తామని పీఏ శ్రీనివాసరావు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

రోడ్డు కోసం విద్యార్థుల ధర్నా



రోడ్డు పనులు అడ్డుకున్న విద్యార్థులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు శనివారం ధర్నా నిర్వహించారు. తొలుత కళాశాల గేటు ముందు జరుగుతున్న పుట్టపర్తి – ముదిగుబ్బ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాల గేటు ముందు రోడ్డు 15 అడుగుల లోతు తవ్వి రహదారి నిర్మిస్తుండటంతో తాము లోపలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు కాలేజీలోకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్‌షెల్టర్ వద్ద జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.